# గాంధీజీ బాటలో...



**గాంధేయ మార్గంతోనే ప్రపంచంలో శాంతి పెంపొందించేందుకు సాధ్యం అవుతుంది.**

మొదట ఇంటిని చక్కదిద్దుకోవాలి. ఆ తరువాత సమాజ ఉద్ధరణలో మమేకం కావాలని ఓ యువకుడు చాటి చెబుతున్నాడు. తాను ఆచరించడమే కాకుండా మిత్రులను కూడా ఆ మార్గంలో పయనింప చేస్తున్నాడు. విద్యార్థులు, యువకులను అస్త్రాలుగా ఎంచుకుని గాంధీ సిద్ధాంతాలను ప్రచారం చేస్తున్న ఓ తెలుగు యువకుడు తన కార్యశీలతను చాటుకుంటున్నాడు.

గుమ్మిడిపూండి, న్యూస్‌లైన్:

గుమ్మిడిపూండి డివిజన్ కొత్త గుమ్మిడిపూండికి చెందిన ఎం. లోకనాథన్. ఎం లక్ష్మీదేవి దంపతుల కుమారుడు రాజేష్(32) చెన్నైలోని హిందూస్థాన్ పెట్రోలియం సంస్థ అకౌంట్స్ విభాగంలో ఉద్యోగి. ఈయనకు చిన్ననాటి నుంచే గాంధీజీ జీవిత విశేషాలు తెలుసుకోవాలనే ఆసక్తి ఎక్కువా ఉండేది. ఆ మక్కువతో అనేక ప్రదేశాలు, రాష్ట్రాల్లో తిరిగి గాంధీజీ నాణేలు, విగ్రహాలు, పోస్టల్, స్టాంపులు సేకరించారు.

**మిత్రులను ప్రేరేపించి...**

విద్యార్థి దశ నుంచే తల్లిదండ్రుల ప్రోత్సాహంతో గాంధీజీ సమాధిని, గుజరాత్‌లోని సబర్మతి ఆశ్రమాన్ని సందర్శించి గాంధీజీకి సంబంధించిన అనేక విషయాలు తెలుసుకున్నాడు. ఆ తరువాత గాంధీజీ వరల్డ్ ఫౌండేషన్‌ను మిత్రులతో కలిసి ప్రారంభించారు.

**విద్యార్థులే అస్త్రాలు**

గాంధీ మార్గంలో సమాజాన్ని పయనింప చేయాలనే లక్ష్యంతో రాజేశ్ విద్యార్థులను అస్త్రాలుగా ఎంచుకున్నాడు. అందులో భాగంగా ఆయన గాంధీ జయంతి, వర్ధంతి, ఉప్పు సత్యాగ్రహం ప్రారంభ దినాల సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నారు. నేటి

## తెలుగుతేజం

తరం బాలలకు గాంధీజీ సిద్ధాంతాలు, ఆయన జీవిత విశేషాలను తెలియజేస్తూ మెరుగైన సమాజాన్ని భవిష్యత్తులో చూడాలనే ఆకాంక్షతో పరిశ్రమిస్తున్నాడు.

**సమాజాన్ని చైతన్యం చేయడంలో**

అందుకోసం గాంధీజీ వరల్డ్ ఫౌండేషన్ ద్వారా ప్లాస్టిక్ నిషేధం, పర్యావరణ పరిరక్షణ, దేశ సమగ్రతకు, ఎయిడ్స్, బాల కార్మిక నిర్మూలన, మద్యపానం, ధూమపానం, అవినీతి రహిత సమాజం కోసం అనేక చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా గ్రామీణ ప్రాంతాల్లోని యువకుల్లో క్రీడా ప్రతిభను వెలికి




చిత్రలేఖన పోటీలో పాల్గొన్న విద్యార్థులు




ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ నిర్వహిస్తున్న చిన్నారులు

తీసేందుకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంఎల్ఆర్ క్రికెట్ అకాడమి ఏర్పాటు చేసి ఉచిత శిక్షణ ఇస్తున్నారు. అలాగే, బాలలకు గాంధీజీ సిద్ధాంతాలు తెలియజేసేందుకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి వారికి బహుమతులను అందజేస్తున్నారు.

**బాధ్యతలు గుర్తు చేస్తూ...**

ఫౌండేషన్ ద్వారా యువకుల్లో దేశభక్తి, సమాజసేవ అంశాలను తెలియజేసేందుకు స్వాతంత్ర్య సమరయోధులు, ఆ ఉద్యమాల విశేషాలను వివరించేందుకు రాజేష్ చెన్నైలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. దీనికి మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం, సినీ నటుడు వివేక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. యువకులకు దిశానిర్దేశం చేస్తున్న రాజేశ్‌ను వారు అభినందించారు. ప్రపంచ దేశాలు గాంధీ మహాత్ముని ప్రత్యేకంగా అభిమానిస్తున్నాయి. దాదాపు 120 దేశాల్లో గాంధీజీ పోస్టల్ స్టాంపు విడుదల చేశారు. అలాగే 70 దేశాల్లో గాంధీ విగ్రహాలు, 20 దేశాల్లో నాణేలు ముద్రించి గాంధీజీపట్ల వారికున్న గౌరవాన్ని చాటుకున్నాయి. అమెరికాలో 40 గాంధీ విగ్రహాలు ఉండడం మన దేశానికి గర్వకారణం. అందుకే గాంధీజీ వరల్డ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గాంధీజీ సిద్ధాంతాలు ప్రచారం చేయడానికి చిత్తశుద్ధితో వ్యవహరిస్తున్నట్లు రాజేశ్ వినమ్రంగా చెబుతున్నారు.

**అక్టోబర్ రెండున**

గాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ రెండో తేదీ గుమ్మిడిపూండిలో భారీ ఎత్తున పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రాజేశ్ తెలిపారు. అందులో భాగంగా విద్యార్థుల కోసం ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రం ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. ట్రస్టు మేనేజర్‌గా ఆర్. విజయలక్ష్మి, సభ్యులుగా శ్యాంసుందర్ సహకారం అందిస్తున్నారు. ఓ తెలుగువ్యక్తిగా తమిళనాట అనేక మంది ప్రముఖులతో మన్ననలు పొందుతున్న రాజేష్ ముమ్మందు గాంధీజీ సిద్ధాంతాల ప్రచారంలో ఎన్నో శిఖరాలు చేరుకోవాలని ఆశిద్దాం.




ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎంఎల్ రాజేష్‌ను సత్కరిస్తున్న మాజీ రాష్ట్రపతి కలాం




ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సహాయకాలు అందజేస్తున్న దృశ్యం